క్లుప్తంగా

నేడు రక్తదాన శిబిరం

కేపీహెచ్‌బీకాలనీ: తలసీమియా రోగుల కోసం రక్తదాన శిబిరాన్ని నిర్వహించనున్నట్లు ఉప్పల వెంకయ్య మెమోరియల్ బ్లడ్ సెంటర్ నిర్వాహకులు ఓ ప్రకటనలో తెలిపారు. ఈ శిబిరాన్ని జేఎన్‌టీయూ ఇంజినీరింగ్ కళాశాల గ్రౌండ్‌ఫ్లోర్‌లో ఏర్పాటు చేస్తున్నామని పేర్కొన్నారు. బుధవారం ఉదయం 10గంట నుంచి మధ్యాహ్నం 4గంటల వరకు కొనసాగుతుందని తెలిపారు. విద్యార్థులు శిబిరంలో పాల్గొని రక్తదానం చేయాలని కోరారు.

రంజాన్ తోఫాల పంపిణీ



కేటీఆర్ కాలనీలో ముస్లింలకు తోఫాలను అందజేస్తున్న కార్పొరేటర్

ఆల్విన్‌కాలనీ: ప్రభుత్వం అందజేస్తున్న రంజాన్ తోఫాలను మంగళవారం కేటీఆర్ కాలనీలో కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్‌గౌడ్ ముస్లింలకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి అన్ని మతాలను గౌరవిస్తూ కొత్త దుస్తులు పంపిణీ చేయడం గొప్ప విషయమన్నారు. పేద, ధనిక అనే తారతమ్యం లేకుండా ప్రజలందరూ ఆనందంగా పండుగలను జరుపుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు సమ్మారెడ్డి, అనిల్‌రెడ్డి, షౌకత్‌అలీ మున్నా, ముజీబ్, షబ్బీర్, ప్రదీప్‌రెడ్డి, పోశెట్టిగౌడ్, కరుణాకర్, సలీమ్, ఆలీ, ఖాజా, కరణ్ సింగ్, తదితరులు పాల్గొన్నారు.

18 మందికి కరోనా పరీక్షలు

రాయదుర్గం: కొండాపూర్‌లోని జిల్లాస్థాయి ఆస్పత్రిలో కరోనా పరీక్షలు కొనసాగుతున్నాయి. మంగళవారం 18 మందికి కరోనా పరీక్షలు నిర్వహించగా అందరికీ నెగటివ్ వచ్చింది. ఇద్దరికి ఆర్‌టీపీసీఆర్, 16 మందికి ర్యాపిడ్ యాంటీజెన్ టెస్టులు నిర్వహించారు.

పటేల్‌కుంట పార్కు పనుల పరిశీలన



పనులను పరిశీలిస్తున్న మాధవరం రంగారావు

ఆల్విన్‌కాలనీ: వివేకానందనగర్ డివిజన్ పరిధిలోని పటేల్ కుంట పార్కు అభివృద్ధికి 1కోటి 80 లక్షల రూపాయల కేటాయించింది. ఈ మేరకు చేపట్టిన అభివృద్ధి పనులను మంగళవారం మాజీ కార్పొరేటర్ మాధవరం రంగారావు, డీఈ వెంకటరమణ, ఏఈ సంధ్యతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... నాణ్యతా ప్రమాణాలతో పనులు త్వరగా పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలన్నారు. ఈ కార్యక్రమంలో చెన్నయ్య, వెంకటేశ్వర్లు, వెంకట్రావు, ప్రకాష్, రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరాలను వినియోగించుకోవాలి



వైద్య శిబిరంలో పాల్గొన్న బీజేపీ సీనియర్ నాయకుడు వడ్డేపల్లి రాజేశ్వరరావు

కూకట్‌పల్లి: కూకట్‌పల్లి నియోజకవర్గంలో నిరంతరాయంగా 30 రోజుల పాటు నిర్వహిస్తున్న ఉచిత మెగా వైద్య శిబిరాన్ని వినియోగించుకోవాలని బీజేపీ సీనియర్ నాయకుడు వడ్డేపల్లి రాజేశ్వరరావు పేర్కొన్నారు. మంగళవారం 5వ రోజు ఫతేనగర్‌లో ఏర్పాటు చేసిన వైద్య శిబిరాన్ని ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూకట్‌పల్లి నియోజకవర్గ ప్రజల ఆరోగ్యం దృష్ట్యా ఈ ఉచిత హెల్త్ క్యాంపు ఏర్పాటు చేశామన్నారు. నియోజకవర్గంలో 30 రోజుల పాటు ఒక్కో ప్రాంతంలో ఈ హెల్త్ క్యాంపు ఉంటుందని తెలిపారు. ఈ శిబిరంలో స్థానికులు పెద్ద ఎత్తున వైద్య ఆరోగ్య పరీక్షలు ఉచితంగా చేయించుకోవచ్చని సూచించారు. ఈ సందర్భంగా వైద్య సేవలు అందిస్తున్న కేబీకే హాస్పిటల్ యాజమాన్యానికి, సిబ్బందికి కృతజ్ఞతలు తెలిపారు.


డివైడర్‌కు ఢీకొట్టి.. వ్యక్తి మృతి

కేపీహెచ్‌బీకాలనీ: కేపీహెచ్‌బీ కాలనీ 4వ ఫేజ్‌కు చెందిన డప్పు రాజు (37) బైక్ మెకానిక్. సోమవారం రాత్రి 8గంటలకు బీకేగూడలోని తన త్రండి ఇంటికి వెళ్లాడు. తిరిగి అర్ధరాత్రి కేపీహెచ్‌బీకాలనీకి బైక్‌పై బయల్దేరాడు. అతివేగంగా బైక్‌ను నడుపుతున్న రాజు అదుపుతప్పి కేపీహెచ్‌బీ కాలనీలోని లోదా అపార్టుమెంట్ ప్రాంతంలో డివైడర్‌ను ఢీకొట్టాడు. తీవ్ర గాయాలు కావడంతో స్థానికులు రాజును ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ మంగళవారం ఉదయం మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. సమాచారం అందుకున్న కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేయటంతో పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

చెరువుల సుందరీకరణ వేగవంతం

- చెరువుల అభివృద్ధిపై అధికారులతో సమీక్ష
- పాల్గొన్న ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు, జోనల్ కమిషనర్ మమత





కూకట్‌పల్లిలోని చెరువుల సుందరీకరణకు చెందిన నమూనా ప్లాన్

కూకట్‌పల్లి: కూకట్‌పల్లి నియోజకవర్గంలోని కాముని చెరువు, ముళ్లకత్వ, రంగధాముని చెరువుల అభివృద్ధి పనులపై మంగళవారం ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు, జోనల్ కమిషనర్ మమతతో మూసాపేటలోని మున్సిపల్ కార్యాలయంలో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారులు చెరువుల అభివృద్ధికి సంబంధించి ప్రణాళికలను ఎమ్మెల్యేకు వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 300 కోట్ల రూపాయలతో చేపడుతున్న చెరువుల సుందరీకరణ విషయంలో ఎక్కడా రాజీపడవద్దన్నారు.చెరువుల్లోని గుర్రపు డెక్క తొలగించి చెరువు చుట్టూ ఆహ్లాద వాతావరణం ఉట్టిపడేలా తీర్చిదిద్దాలని సూచించారు. రంగధాముని చెరువు పనులు త్వరత్వరగా జరుగుతున్నాయని తెలిపారు. మిగిలిన చెరువుల పనులకు కూడా త్వరగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. చెరువుల వద్ద నిర్మాణం అవుతున్న ఎస్‌టీపీ ప్లాంట్ల వల్ల మురుగు కూడా చెరువుల్లో కలవదన్నారు. దీంతో దోమలు బెడద కూడా ఉండదన్నారు.అలాగే ఎవరైనా పట్టాదారులు ఉంటే వారికి టీడీఆర్ అందజేస్తామని ఎవరికి ఎటువంటి ఇబ్బంది లేకుండా చూసుకునే బాధ్యత తమపై ఉందని ప్రజలకు తెలిపారు. ఎవరికైనా ఇబ్బంది ఉంటే తనను సంప్రదించాలని కోరారు. ఈ కార్యక్రమంలో డీసీ రవికుమార్,ఎస్సీ చెన్నారెడ్డి, ఈఈ సత్యనారాయణ,డీఈ ఆనంద్, ఎంఆర్‌ఓ గోవర్ధన్, జీహెచ్‌ఎంసీ అధికారులు గోవర్ధన్ తదితరులు పాల్గొన్నారు.

బాలాజీనగర్‌ను వందల కోట్లతో అభివృద్ధి చేశాం



ఆత్మీయ సమ్మేళనంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు. పాల్గొన్న కార్యకర్తలు



బీఆర్‌ఎస్ ఆత్మీయ సమ్మేళనంలో ఎమ్మెల్యే

మూసాపేట: తెలంగాణలో ఓటు అడిగే హక్కు బీఆర్‌ఎస్ పార్టీకే ఉందని ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు అన్నారు. బాలాజీనగర్ డివిజన్‌లోని ఆంజనేయనగర్ కమ్యూనిటీహాలులో డివిజన్ స్థాయి కార్యకర్తల ఆత్మీయ సమ్మేళన కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ... ముఖ్యమంత్రి కేసీఆర్ ఆధ్వర్యంలో జరుగుతున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. బాలాజీనగర్ డివిజన్‌లో వందల కోట్ల రూపాయలతో అభివృద్ధి పనులు పూర్తి చేశామన్నారు. రూ.300 కోట్లతో 3 చెరువులను అభివృద్ధి చేస్తున్నామని తెలిపారు. కేంద్ర ప్రభుత్వం ఐడీపీఎల్ స్థలం కేటాయిస్తే 30 వేల మందికి డబుల్ బెడ్ రూమ్ ఇళ్లు కట్టి ఇచ్చే బాధ్యత తీసుకుంటానని పేర్కొన్నారు. బీజేపీకి చిత్తశుద్ధి ఉంటే ఖచ్చితంగా పేదల కోసం స్థలం కేటాయించాలన్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ పగుడాల శిరీష బాబూరావు, కోఆర్డినేటర్ సతీష్ అరోరా, మాజీ కార్పొరేటర్ తూము శ్రావణ్‌కుమార్, డివిజన్ అధ్యక్షుడు ప్రభాకర్ గౌడ్, కార్యదర్శి వెంకటేష్ చౌదరి, మహిళా అధ్యక్షురాలు అనితా శ్రీపాద తదితరులు పాల్గొన్నారు.

తడి, పొడి చెత్తను కార్మికులకు వేర్వేరుగా ఇవ్వాలి



స్పెషల్ శానిటేషన్ కార్యక్రమంలో పాల్గొన్న కార్పొరేటర్ సబిహా బేగం, అధికారులు

మోతీనగర్: చెత్తాచెదారాన్ని ఎక్కడ పడితే అక్కడ వేయకుండా ఉదయం వచ్చే ఆటో రిక్షా కార్మికులకు అందజేయాలని అల్లాపూర్ కార్పొరేటర్ సబిహా బేగం పేర్కొన్నారు. మంగళవారం వివేకానందనగర్ వార్డు కార్యాలయంలో స్పెషల్ శానిటేషన్ 100 రోజుల కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ బాధ్యతతోనే తడి, పొడి చెత్తను వేరు చేసి ఆటో కార్మికులకు అందజేయాలన్నారు. అదే విధంగా అపార్టుమెంట్‌లోని వారు కూడా ఆటో కార్మికులకు అందజేయాలని కోరారు. అది సాధ్యం కాకపోతే అపార్టుమెంట్‌లో ఒక డ్రమ్ము ఏర్పాటు చేసి అందులో వేసి రిక్షా కార్మికులకు అందజేయాలన్నారు. అదే విధంగా డివిజన్‌లో తిరుగుతున్న కుక్కలపై అధికారులు దృష్టి సారించాలన్నారు. కుక్కలను దూర ప్రాంతాలకు తరలించాలని అధికారులను కోరారు. రోడ్డుపై చిన్న గుంతలు ఏర్పడితే వెంటనే పూడ్చాలని సూచించారు. అపార్టుమెంట్‌వాసులు ఇంకుడు గుంతలు ఏర్పాటు చేసుకోవాలన్నారు. భావితరాలకు నీటి సమస్య రాకుండా ఉండాలంటే మొక్కలు నాటి పెంచాలన్నారు. ఈ కార్యక్రమంలో పీఓ ప్రభాకర్, టౌన్‌ప్లానింగ్ ఆఫీసర్ రమేష్, సీఓ ప్రసాద్, డివిజన్ అధ్యక్షుడు ఐలయ్య, కోఆర్డినేటర్ వీరారెడ్డి, మహిళా అధ్యక్షురాలు పార్వతమ్మ, పర్వత్‌నగర్ అధ్యక్షుడు బాబా, జగన్, జ్ఞానేశ్వర్, రవీందర్‌రెడ్డి, పార్టీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి ఉచిత అంబులెన్స్ సేవలు

చింతల్: భగత్‌సింగ్‌నగర్ వాసుల సౌకర్యార్థం గర్భిణుల కోసం ఉచిత అంబులెన్స్ సేవలను బుధవారం ప్రారంభించనున్నట్లు భగత్‌సింగ్‌నగర్ సీనియర్ నాయకుడు అల్లా బకాష్ ఓ ప్రకటనలో తెలిపారు.

అభినందనలు



మూసాపేట: మూసాపేట డివిజన్ బీజేపీ అధ్యక్షుడు పిట్ల మనోహర్‌కు ఉత్తమ ప్రజా సేవకుడు పురస్కారాన్ని అందుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మంగళవారం బీజేపీ అధ్యక్షుడు బండి సంజయ్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. పిట్ల మనోహర్‌ను ఆయన ప్రశంసించి అభినందించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర బీజేపీ లీగల్ సెల్ నాయకురాలు సద్గుణరెడ్డి, మేడ్చల్ జిల్లా బీజేపీ ఎస్సీ మోర్చా నాయకులు నవీన్‌కుమార్, మన్నే యాదగిరి, మూసాపేట డివిజన్ ఉపాధ్యక్షుడు దోమల శ్రీనివాస్, కిషోర్‌కుమార్, సాయికుమార్ పాల్గొన్నారు.

అంబేడ్కర్‌నగర్‌లోని సమస్యలను పరిష్కరిస్తా

కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్‌గౌడ్



అంబేడ్కర్‌నగర్‌లో సమస్యలను పరిశీలిస్తున్న కార్పొరేటర్

ఆల్విన్‌కాలనీ: ఆల్విన్‌కాలనీ డివిజన్ పరిధిలోని అంబేడ్కర్‌నగర్ కాలనీలో విద్యుత్ స్తంభాలు, డ్రైనేజీ లైన్ల సమస్యలను కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్‌గౌడ్ దృష్టికి కాలనీవాసులు తీసుకొచ్చారు. దీనిపై స్పందించిన ఆయన మంగళవారం కాలనీవాసులతో కలిసి సమస్యలను స్వయంగా పరిశీలించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ.. అంబేడ్కర్‌నగర్ కాలనీలో 90 శాతం అభివృద్ధి పనులు పూర్తయ్యాయని పేర్కొన్నారు. రెండు విద్యుత్ స్తంభాలు ప్రమాదకరంగా ఉన్నాయన్నారు. వాటిని వెంటనే మార్చే విధంగా సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లానని తెలిపారు. అదే విధంగా డ్రైనేజీ మెయిన్ లైన్‌లోకి కలపాల్సి ఉందని దానిని కూడా త్వరగా పరిష్కరించే విధంగా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో యువనేత దొడ్ల రామకృష్ణగౌడ్, నాయకులు అనిల్ రెడ్డి, చిన్నోళ్ల శ్రీనివాస్, కాశీనాథ్‌యాదవ్, గుడ్ల శ్రీనివాస్, బోయకిషన్, పోశెట్టిగౌడ్, వెంకటేష్, కటిక రవి, దుర్గేష్ తదితరులు పాల్గొన్నారు.

కాలనీల సమస్యలను పట్టించుకోవడం లేదు

బీజేపీ నాయకుడు రవికుమార్ యాదవ్



పాదయాత్రలో పాల్గొన్న బీజేపీ నాయకులు

ఆల్విన్‌కాలనీ: గడపగడపకు బీజేపీ కార్యక్రమంలో భాగంగా మంగళవారం రవికుమార్ యాదవ్ ప్రధాని మోదీ చేసిన అభివృద్ధి, సంక్షేమ పథకాలను వివరిస్తూ కరపత్రాలను అందజేశారు. జన్మభూమి కాలనీలో పర్యటించిన అనంతరం ఆయన మాట్లాడుతూ... కాలనీలో సమస్యలు విలయ తాండవం చేస్తుంటే అధికారులు, ప్రజాప్రతినిధులు పట్టించుకోవడం లేదన్నారు. రానున్న ఎన్నికల్లో బీజేపీ అధికారంలోకి రాగానే ప్రజలకు ఆమోదయోగ్యమైన సదుపాయాలను కల్పిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమం జిల్లా ఉపాధ్యక్షుడు రామరాజు, నాయకులు నరేందర్‌రెడ్డి, కుమార్‌యాదవ్, రవీంద్రరావు, కమలాకర్‌రెడ్డి, నర్సింగ్‌యాదవ్, నరసింహాచారి, స్రవంతి, అనితల ఆధ్వర్యంలో జరిగింది.

చోరీలకు పాల్పడుతున్న ఇద్దరి అరెస్టు

రూ.4లక్షల సొత్తు స్వాధీనం



వివరాలు వెల్లడిస్తున్న ఏసీపీ చంద్రశేఖర్

భాగ్యనగర్‌కాలనీ: చెడు అలవాట్లకు బానిసై ఇళ్లల్లో దొంగతనాలకు పాల్పడుతున్న ఇద్దరు దొంగలను కూకట్‌పల్లి పోలీసులు అరెస్టు చేశారు. వారి వద్ద నుంచి రూ.4 లక్షల విలువైన సొత్తును స్వాధీనం చేసుకున్నారు. కూకట్‌పల్లి పోలీస్‌స్టేషన్‌లో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఏసీపీ చంద్రశేఖర్ వివరాలను వెల్లడించారు. మెదక్ జిల్లాకు చెందిన ఎస్.శ్యామ్‌కుమార్ (19) కూకట్‌పల్లిలో తన సోదరి వద్ద ఉంటూ ఫంక్షన్‌హాల్‌లో కూలిగా పని చేస్తున్నాడు. గతంలో సరూర్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జైలుకు వెళ్లి వచ్చాడు. తిరిగి తన చిన్ననాటి స్నేహితుడైన మధుకుమార్‌తో (20) కలిసి సులువుగా డబ్బు సంపాదించాలని దొంగతనాలు చేయాలని నిర్ణయించుకున్నారు. ఈ క్రమంలోనే బాగ్ అమీర్, చిత్తారమ్మ దేవాలయం సమీపంలో మూడు ఇళ్లల్లో దొంగతనానికి పాల్పడి 6.8 తులాల బంగారు ఆభరణాలు, కేజీ వెండి ఆభరణాలు దొంగిలించారు. ఈ ఆభరణాలను కూకట్‌పల్లి బస్‌స్టాప్ సమీపంలో బంగారం షాపులో అమ్మేందుకు యత్నించగా సీసీఎస్, కూకట్‌పల్లి పోలీసులు ఇద్దరిని అదుపులోకి తీసుకున్నారు. విచారణలో నేరాన్ని అంగీకరించడంతో వారిని రిమాండ్‌కు తరలించారు. ఈ సమావేశంలో కూకట్‌పల్లి సీఐ నర్సింగ్‌రావు, డీఐ ఆంజనేయులు, ఎస్సై రజాక్, రామకృష్ణ, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.



పూలే విగ్రహానికి నివాళులర్పిస్తున్న మాజీ కార్పొరేటర్ మాధవరం రంగారావు

గొప్ప సంఘ సంస్కర్త జ్యోతిబాపూలే

మహాత్మా జ్యోతిబాపూలే జయంతి మంగళవారం కూకట్‌పల్లి నియోజకవర్గంలో ఘనంగా జరిగింది. ప్రజాప్రతినిధులు, రాజకీయపార్టీలు, ప్రజా సంఘాల నాయకులు పూలే చిత్ర పటాలు, విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ.. మహాత్మా జ్యోతిబాపూలే గొప్ప సంఘ సంస్కర్త అని అన్నారు. సమాజంలో అణగారిన వర్గాలకు అండగా ఉంటూ వారి గెలుపు కోసం ఆయన ఎన్నో త్యాగాలు చేశారన్నారు. మహిళల హక్కుల కోసం, బడుగు బలహీనవర్గాల అభ్యున్నతికి పాటు పడిన మహనీయుడని కొనియాడారు. – కూకట్‌పల్లి:



మున్సిపల్ కార్యాలయంలో నివాళులర్పిస్తున్న జెడ్‌సీ మమత, ఎమ్మెల్యే, అధికారులు



నివాళులర్పిస్తున్న టీపీసీసీ సభ్యుడు డా. సత్యం శ్రీరంగం



కూకట్‌పల్లి బీజేపీ కార్యాలయంలో పూలే జయంతి వేడుకల్లో సూర్యారావు, రాజేశ్వరరావు



నివాళులర్పిస్తున్న కూకట్‌పల్లి బీఆర్‌ఎస్ నాయకుడు గొట్టిముక్కల వెంకటేశ్వరరావు



నివాళులర్పిస్తున్న మేడ్చల్ అర్బన్ జిల్లా ఓబీసీ ఉపాధ్యక్షుడు పులిగొల్ల శ్రీనివాస్ యాదవ్



పూలే చిత్రపటానికి నివాళులర్పిస్తున్న యువ నాయకుడు దొడ్ల రామకృష్ణ గౌడ్



ఆంజనేయనగర్‌లో పూలే చిత్రపటానికి నివాళులర్పిస్తున్న కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు

'నా దృష్టికి వచ్చిన సమస్యలను వెంటనే పరిష్కరిస్తున్నా'

కార్పొరేటర్ నార్నే శ్రీనివాసరావు



భాగ్యనగర్‌కాలనీ: హైదర్‌నగర్ డివిజన్ పరిధిలోని ఆలీతలాబ్ చెరువు వద్ద రూ.1.83 కోట్ల అంచనా వ్యయంతో నిర్మిస్తున్న అలుగు తూము నిర్మాణం, వ్యర్థనీటి పైపులైన్ పనులను ఇరిగేషన్, ఇంజినీరింగ్ అధికారులతో మంగళవారం కార్పొరేటర్ నార్నే శ్రీనివాసరావు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. డ్రైనేజీ సమస్య పరిష్కారమే ధ్యేయంగా ముందుకు వెళ్తున్నామని అన్నారు. కాలనీల ప్రజల వినతి మేరకు అవసరం ఉన్న చోట పనులు చేపడుతున్నామని తెలిపారు. డివిజన్‌ను మరింత అభివృద్ధి చేసి ఆదర్శవంతమైన డివిజన్‌గా తీర్చిదిద్దుతానని తెలిపారు. కార్యక్రమంలో ఇరిగేషన్ ఏఈ విశ్వం, ఏఈ రాజీవ్, కాంట్రాక్టర్ శ్రీధర్ రెడ్డి, అశోక్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నైపుణ్యం ఉన్న వారికి గుర్తింపు

కొండాపూర్ బెటాలియన్ కమాండెంట్ మురళీకృష్ణ



రాయదుర్గం: నైపుణ్యం ఉన్నవారికి మంచి గుర్తింపు ఉంటుందని కొండాపూర్ 8వ బెటాలియన్ కమాండెంట్ మురళీకృష్ణ అన్నారు. మంగళవారం బెటాలియన్‌లో విమెన్ ఎంపవర్‌మెంట్‌లో భాగంగా స్కిల్ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్‌ను ఆయన జనశిక్షణ సంస్థాన్ డైరెక్టర్ రామ్మోహన్‌తో కలిసి జ్యోతి వెలిగించి ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మహిళలు కేవలం ఇంటికే పరిమితం కాకుండా వారికి కూడా శిక్షణ ఇవ్వడం ద్వారా తమ కాళ్ళపై తాము నిలబడడమే కాకుండా కుటుంబాన్ని పోషించే స్థాయికి ఎదగాలని సూచించారు. టైలరింగ్, ఎంబ్రాయిడరీ, మగ్గం, బ్యూటీషియన్ కోర్సులపై మూడు నెలల శిక్షణా కార్యక్రమంలో 40 మంది బెటాలియన్ మహిళా కుటుంబసభ్యులు పాల్గొన్నారు. కార్యక్రమంలో బెటాలియన్ అదనపు కమాండెంట్ టీటీఎన్‌సింగ్, బెటాలియన్ అధికారులు, శిక్షకులు, సిబ్బంది పాల్గొన్నారు.

నిర్వహణ శూన్యం

- ఖాళీ ప్రాంతాల్లో చెత్త డంప్
- తరలించని పారిశుద్ధ్య సిబ్బంది
- దుర్వాసనతో స్థానికులకు ఇబ్బందులు

ఓల్డ్‌బోయిన్‌పల్లి: డివిజన్‌లో పట్టణ ప్రగతి లక్ష్యం నీరుగారిపోతోంది. డివిజన్‌లో పారిశుద్ధ్య నిర్వహణ రోజురోజుకు అస్తవ్యస్తంగా తయారవుతోంది. జీహెచ్‌ఎంసీ అధికారులు ఏన్ని చర్యలు తీసుకుంటున్నా ఖాళీ ప్రదేశాల్లో డంపింగ్ కేంద్రాలుగా మారుతున్నాయి. తీవ్ర దుర్వాసనతో పరిసర ప్రాంతవాసులు ఇబ్బందులు పడుతున్నారు. ఓల్డ్ బోయిన్‌పల్లి డివిజన్ అంజయ్యనగర్, హస్మత్‌పేట ప్రాంతాలలో ఈ సమస్య ఎక్కువగా కనిపిస్తోంది. చెత్త కుండీలను పందులు తమ ఆవాసాలుగా మార్చుకుంటున్నాయి.

◆ హస్మత్‌పేట బోయిన్ చెరువు కట్టకు ఇరువైపుల ప్రజలు చెత్తను పారబోస్తున్నారు. ఆయా ప్రాంతాలలో డస్ట్‌బిన్లను తొలగించి చెత్త వేయకుండా కొన్ని రోజులు సిబ్బంది బాగానే చర్యలు చెపట్టారు. పందులు, కుక్కలు చెత్తను చెల్లాచెదురు చేస్తుండటంతో చెత్తంతా రోడ్డు మీదకి వస్తోంది. వాహనదారులు, పాదచారులు ఇబ్బందులు పడుతున్నారు. హస్మత్‌పేట, అంజయ్యనగర్, బోయిన్ చెరువు కట్ట, హరిజన బస్తీ, కోయబస్తీ, ఎల్‌బీనగర్ వంటి పలు ప్రాంతాలలో కొన్ని రోజులుగా చెత్తను తొలగించకపోవడంతో దుర్గంధంగా మారాయి.

పారిశుద్ధ్య సిబ్బంది ఎప్పటికప్పుడు చెత్తను తొలగించాల్సింది పోయి అక్కడే వదిలేస్తున్నారని స్థానికులు పేర్కొంటున్నారు. దుర్గంధం, దుర్వాసనతో రోగాల బారిన పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సంబంధిత అధికారుల పర్యవేక్షణ లోపంతోనే ఇలా జరుగుతోందని ఆరోపిస్తున్నారు.



హస్మత్‌పేట నుంచి ఓల్డ్ బోయిన్‌పల్లి చౌరస్తాలో రోడ్డు పక్కన చెత్త కుప్పలు